# రెండు ఆకులూ ఒక మొగ్గా!

ఒక రోడు మూడుగా చీలింది. మూడు రోడ్లు ఏర్పడ్డాయి. ఆ చీలిక దగ్గర నిలబడ్డ ఓ యువకునికి పెద్ద సమస్య వచ్చి పడింది. ఏ రోడ్డున తను వెళ్ళితే గమ్యస్థానానికి చేరుకోవచ్చు! అట్లాంటి పెద్ద సమస్యే-మెడిసన్ ప్యాసై హౌస్‌సర్జన్ చేస్తోన్న ఈశ్వర్రావుకు వొచ్చిపడింది. ఆతని కాళ్ళదగ్గరకు మూడు సంబంధాలొచ్చాయి. ఏ సంబంధం చేసుకుంటే తన జీవితం తేనె పొరలుగా సుఖంగా జరిగిపోతుంది!

ఒక సంబధం పాలెంనుంచి వొచ్చింది. గొప్ప ఆస్తిపరులు. కట్నం భారీఎత్తున ముట్టచెబుతారు. లక్షరూపాయల రొక్కం, రెండెకరాల నిమ్మతోట, మూడెకరాల శేరీమాగాణి. పిల్లకు రెండువందల కాశీల బంగారునగకట్టు ఉంది. కాని పెళ్ళికూతురు ఆట్టే అందగత్తెకాదు. చదువుకూడా కాలేజీ మొహం చూడనట్టిదే.

రెండో సంబంధం పొన్నూరునుంచి వచ్చింది. అందంలో అప్సరస. చదువు సంసారాన్ని చక్కదిద్దుకోవడానికి పనికివచ్చే తీరులో ఉంది. కాని కట్నం పెద్దఎత్తున ఇవ్వలేరు. పేరుకు పదివేలవరకూ ఇవ్వగలరు.

మూడోసంబంధం తెనాలినుంచి వచ్చింది. ఆమ్మాయి చదువుల సరస్వతేగాని, ధనలక్ష్మి కాదు. అందాల కాణాచి కాదు. ఎం. ఏ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలై ఓ ఆడపిల్లల కాలేజీలో

లెక్చరరుగా ఉద్యోగం చేస్తూన్నది. ఆ మూడు సంబంధాలనూ ఈశ్వర్రావు తల్లిదండ్రులతోపాటు వెళ్ళి 'పెళ్లి చూపులు' తతంగంద్వారా చూసి వచ్చాడు. ఆ రోజు ఏదో నిర్ణయాని కొచ్చి తండ్రితో చెబితే, ఆయన మిగతా ఇరువురికి 'మరో చోట చూసుకోండి' అంటూ లేఖలు వ్రాస్తాడు. అర్ధాంగిని ఎన్నుకోవడంలో ఈశ్వర్రావుకు తండ్రి పూర్తి స్వేచ్ఛనిచ్చాడు. "నీకు ఏ సంబంధం నచ్చితే-మాకు అదే నచ్చుతుంది," అన్నాడు అతని తండ్రి ఖచ్చితంగా. ఈశ్వర్రావు ఆ మధ్యాహ్నం ఒంటరిగా తనగదిలో కూర్చుని ఆలోచనలమీద ఆలోచనలు చేసి, కొసకు ఓ నిర్ణయానికి దృఢంగా వచ్చాడు. పొన్నూరు పిల్లనే పెండ్లి చేసికొనేందుకు నిశ్చయించుకుని ఆ సంగతిని తండ్రికి తెలియపర్చాడు. ఆయన వెంటనే మూడు ఉత్తరాలు వ్రాశాడు- పొన్నూరువారికి ముహూర్త నిర్ణయంకోసమూ, మిగతా ఇరువురికీ దయవుంచి మరో సంబంధం వెతుక్కోమనీ.

అందంలో అప్సరసను మించిన అమ్మాయితోనే ఈశ్వర్రావు వివాహం జరిగింది.

* * * * *

శోభనంనాటి రాత్రి తన భార్య విజయను మనసారా దగ్గరకు తీసికొని ఆమె లేగులాబీ చెక్కిళ్ళను ఎరుపుచేసి, ఆమె సిగ్గుతో మల్లెమొగ్గ కాగా — "నేను నిన్నెందుకు పెళ్లి చేసుకున్నానో తెలుసా?" అని అడిగాడు ఈశ్వర్రావు.

"ఎందుకు?" అన్న భావం ధ్వనించేట్టు వోరగా భర్తకేసి చూసింది విజయ.

అపూర్వమైన నీ అందం చూసి. నేను సౌందర్యోపాసకుణ్ణి. స్త్రీలో సౌందర్యాన్నే మిక్కుటంగా ఆరాధిస్తాను. నాఆరాధ్య

దేవతవు నువ్వు. కాని నేను అందగాణ్ణి కాదు."

ఆమె పెదవులు విప్పలేదు. మౌనంగా వినసాగింది, చూపులు గదిగోడలపై నిలిపి. "భారీఎత్తున కట్నం తెచ్చే యువతినీ, ఎం. ఏ. చదివిన యువతినీ కాదని నిన్ను పెళ్ళి చేసుకోవడంలో నాకూ ఓ విధమైన సంతృప్తీ, ప్రతీకార వాంఛానివృత్తే లేక పోలేదు. నిజం చెబుతున్నాను. ముక్కుకు సూటిగా పోయే మనస్తత్వం నాది నా నిజాయితీ, నిర్మొహమాటంవల్ల ఎదుటి వాళ్ళు బాధపడ్డా నేను నొచ్చుకోను. నేను గుంటూరులో మెడిసిన్ చదివే ఓ అమ్మాయిని గాఢంగా ప్రేమించాను. ఆమె సౌందర్యవతి. ఆమె సౌందర్య విశేషమే నన్ను మంత్రముగ్ధుణ్ణిగా చేసి, ఆమెపై ప్రేమాభిమానాల ఉష్ణోగ్రతను హెచ్చుపర్చింది. కాని ఆమె నన్ను ప్రేమించలేదు; తిరస్కరించింది. కారణం—నేను అందంగా లేకపోవడం. ఆమెకంటె అందమైన యువతిని పెళ్ళాడటమే నా వాంఛ. లోకోత్తరమైన రూపురేఖావిలాసాలతో మెరిసిపోతూన్న నిన్ను పొందాక ఆ ప్రతీకారవాంఛ నెరవేరిందన్న సంతృప్తి నాలో నరనరాల్లో ప్రాకి గొప్ప విజయాన్ని సాధించిన సంతోషం కలిగింది." ఆమె రవ్వంత చలించినా, చూపుల్ని గదిగోడలనుంచి మరల్చలేదు.

"నువ్వు నన్ను పెళ్ళిచేసికోడంలో విశేషమేమైనా ఉందా?" అన్నాడు ఈశ్వర్రావు ఆమె మొహాన్ని తన ప్రక్కకు తిప్పుకుని.

ఆమె విచలితమైంది.

'విశేషం ఉంది. నన్ను మా మేనమామగారి అబ్బాయికి చిన్నప్పట్నుంచీ మొల్చుకున్నారు. అతను ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కాని ఎక్కువ కట్నం ఇవ్వలేమన్న ఉద్దేశ్యంతో నన్ను వివాహం చేసికోవడానికి ఇష్టపడలేదు. అతనికంటె ధన

వంతుణ్ణీ, విద్యాధికుణ్ణీ భర్తగా పొందాలనే తలంపు నాకున్నది. అది నెరవేరింది,' అని చెబుదా మనుకుంది విజయ. కాని చెప్పలేక పోయింది. అతని సంతోషాన్నీ, సంతృప్తినీ కించపర్చడం సబబుకాదు.

మళ్ళీ అడిగాడు ఈశ్వర్రావు.

"ఉహుఁ, విశేష మేమీలేదు," అన్నది విజయ, చూపుల్ని గదిగోడలకేసి మళ్లించి.

"నువ్వు నా అదృష్టంకొద్దీ దొరికిన పెన్నిధివి," అంటూ ఈశ్వర్రావు ఆమెను బిగియార కౌగిలించుకున్నాడు -కంచి పట్టుచీర నలిగిపోయేట్టు లేత ఎముకలు విరిగిపోయేట్టు. *

(లత)